క్లుప్తంగా

లీకేజీలకు మరమ్మతు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కుభీర్: మండల కేంద్రంలో భగీరథ పైపులైన్లకు లీకేజీలు ఏర్పడి నీరంతా వృథాగా పోతున్న విషయం తెలిసిందే. దీనిపైన సాక్షిలో గత నెల 29న ఆదివారం పైపు లీకేజీకి మరమ్మతు ఏది? అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ సిబ్బంది, భగీరథ అధికారులు గురువారం పైపులైన్లకు మరమ్మతులు చేసి సమస్య పరిష్కరించారు. వారి వెంట ఈవో విజయ్ ఉన్నారు.

నేడు అవగాహన సదస్సు

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లిలో శుక్రవారం సీవిజిల్ యాప్‌పై ఎంపీడీవో మల్లేశ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపీవో చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలను ప్రభావితం చేసేలా వ్యవహరించినా, ఎన్నికల కోడ్ ఉల్లంఘించినా యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. డయల్ 100 లేదా సీవిజిల్ యాప్‌లో ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే విషయమై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

దండారీ సంబరాలు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని తుమ్మగూడెంలో గురువారం దండారీ ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా గిరిజనుల దేవతలకు పూజలు నిర్వహించి గుస్సాడీ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ నాయకుడు నంది రామయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాబా ఆలయానికి పాదయాత్ర

కుంటాల: రెండో షిరిడీగా పేరొందిన మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయానికి గురువారం సూర్యాపూర్ నుంచి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. సాయిని స్మరిస్తూ ఆలయానికి వెళ్లి బాబాను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

మిత్రుడి కుటుంబానికి అండ



ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

ఖానాపూర్: ఆపదలో ఉన్న బాధితుడికి సాయం అందించి అండగా నిలిచారు తోటి మిత్రులు. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన కరిపె రాజశేఖర్ ఇటీవల ఓ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో బాధిత కుటుంబానికి అతడితో కలిసి ఖానాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–96లో పదో తరగతి చదివిన మిత్రులు గురువారం రూ.30వేల ఆర్థికసాయం అందజేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

మామడ: జిల్లా కేంద్రంలో మంత్రి ఐకేరెడ్డి నివాసంలో గురువారం బీజేపీ మండల కన్వీనర్ కొరిపెల్లి లింగారెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా మంత్రి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఐకేరెడ్డి గెలుపునకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగారెడ్డి, లింగారెడ్డి ఉన్నారు.

బీజేపీ అధ్యక్షుడికి సన్మానం

ఖానాపూర్: బీజేపీ నిర్మల్ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన అంజుకుమార్‌రెడ్డిని ఖానాపూర్ పట్టణానికి చెందిన నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు రమణారావు, పట్టణాధ్యక్షుడు నాయిని సంతోష్, ఎనుముల స్వామి, బొశెట్టి శివ, డి.మల్లయ్య, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

టీయూటీఎఫ్ సభ్యత్వ నమోదు

సారంగపూర్: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం టీయూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీప్రసాద్, తొడిశెట్టి రవికాంత్ మాట్లాడారు. దివ్యాంగులైన, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. విద్యాబోధన కుంటుపడకుండా ఖాళీలున్న పాఠశాలల్లో తాత్కాలిక పద్ధతిన ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ధర్మరాజ్, జిల్లా సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, మండలాధ్యక్షుడు కరిపె శివప్రసాద్, నాయకులు శరత్‌చంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

మంచినీళ్లు మహాప్రభో...!

- సర్కారు బడుల్లో తాగునీటికి అవస్థలు
- ఇళ్ల నుంచి బాటిళ్లలో తెచ్చుకుంటున్న విద్యార్థులు
- పాఠశాలల్లో బోరు నీళ్లే దిక్కు
- ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయాలని వేడుకోలు



బోరు నీటిని తాగుతున్న విద్యార్థులు

నర్సాపూర్(జి): ప్రైవేటుకు దీటుగా సర్కారు బడుల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెబుతున్న పాలకుల మాటలు నీటి మీద రాతలుగా మారుతున్నాయి. నర్సాపూర్(జి) మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు శుద్ధజలం అందడం లేదు. కొన్ని పాఠశాలల్లో బోరుబావు(చేతిపంపు)లున్నా.. మరికొన్నింటిలో భగీరథ జలమే దిక్కు. దీంతో పలుమార్లు బోరుబావుల నీటిని తాగి రోగాల బారిన పడతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని వేడుకుంటున్నారు.



నర్సాపూర్(జి) జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంటి నుంచి తెచ్చుకున్న బాటిళ్లతో విద్యార్థులు

నర్సాపూర్(జి) మండలంలోని 21 ప్రభుత్వ పాఠశాలల్లో 1,387 మంది చదువుతున్నారు. వాటిల్లో భగీరథ ద్వారా తాగునీరు అందుతున్న పాఠశాలలు 10 కాగా.. బోరుబావుల ద్వారా మిగిలిన 11 పాఠశాలలు విద్యార్థులకు తాగునీటిని అందిస్తున్నాయి.

సౌకర్యాలపై పట్టింపేది..?

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా సర్కారు బడుల్లో ప్రవేశాలు పెంచడంపై విద్యాశాఖ అధికారులకు ఉన్న శ్రద్ధ విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంపై లేదని పలువురు పేర్కొంటున్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు 476 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి తాగడానికి, మధ్యాహ్న భోజనం వండటానికి బోరు నీరు ఒక్కటే దిక్కు. మన ఊరు– మన బడిలో భాగంగా మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.94 లక్షలతో నూతనంగా మరో ఆరు గదులు, డైనింగ్‌హాల్ నిర్మిస్తున్నారు. కానీ విద్యార్థులకు తాగునీటి వసతి కల్పించకపోవడంతో వారు బోరు నీళ్లు తాగి అనారోగ్యం బారిన పడుతున్నారు.

ఇంటి నుంచి తెచ్చుకుంటున్న విద్యార్థులు..

పాఠశాలల్లో చేతిపంపుల నీరు తాగి రోగాల బారిన పడతున్నామని.. కొందరు విద్యార్థులు ఇళ్ల నుంచి వచ్చేటప్పుడు బాటిళ్ల(సీసా)లో తాగునీటిని తెచ్చుకుంటున్నారు. అవీ రోజంతా సరిపోక మళ్లీ పాఠశాలల్లో బోరు నీరే తాగుతూ అవస్థలు పడుతున్నారు.

ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలి..

పాఠశాలల్లో తాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కస్తూరిబా, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మినరల్ వాటర్ సరఫరా చేస్తున్నారని.. ఇక్కడ మాత్రం బోరు నీళ్లే తాగి కడుపు నింపుకొంటున్నామని విద్యార్థులు వాపోతున్నారు. మరోవైపు దాతలు ముందుకొచ్చి తమ వంతు సాయం అందించాలని వేడుకుంటున్నారు. ఇటీవల కుస్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన మార్వాడే ప్రశాంత్ పాటిల్ అనే ఎన్ఆర్ఐ రూ.50వేల విలువైన వాటర్ ప్యూరిఫైర్ అందించారు.

ఇంటి నుంచి తెచ్చుకుంటున్నా



నర్సాపూర్(జి) పాఠశాలలో బోరు నీళ్లు తాగాల్సి వస్తుంది. నేను రోజు తూరాటిలోని మా ఇంటి నుంచి బాటిల్‌లో పాఠశాలకు నీటిని తెచ్చుకుంటున్నా. కానీ రోజంతా అందులో నీరు సరిపోవడం లేదు. మళ్లీ బోరు నీరే తాగాల్సి వస్తోంది. – ఎస్.సౌమ్య, 8వ తరగతి

దాతలు సహకారం అందించండి



మాది దేగాం. స్థానిక వసతిగృహంలో ఉండి నర్సాపూర్(జి) పాఠశాల లో చదువుతున్నా. నిత్యం పాఠశాలలో బోరునీరే తాగుతున్నాం. దాతలు ముందుకొచ్చి ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయాలి. – వి.నూతన్‌రెడ్డి, ఏడో తరగతి

శుద్ధజలం అందించేందుకు చర్యలు



చేతిపంపులన్న ప్రభుత్వ పాఠశాలల్లో నీటికి నాణ్యత పరీక్షలు నిర్వహిస్తాం. విద్యార్థులు రోగాల బారిన పడకుండా అన్ని చర్యలు తీసుకుంటాం. వారు తాగే బోరు నీరు సరిగా లేకుంటే ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేసి శుద్ధ జలం అందిస్తాం. – రవీందర్‌రెడ్డి, డీఈవో

ఓటుహక్కుపై అవగాహన

లోకేశ్వరం: అర్హులందరూ తప్పనిసరిగా ఈనెల 30న తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. మండలంలోని ధర్మోర గ్రామంలో గురువారం ఓటుహక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో ఈవీఎంలపై ఓటు వేసే విధానం ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలకిషన్, ఓటర్లు ఉన్నారు.

పెంబి మండలంలో..

పెంబి: మండల కేంద్రంతోపాటు మందపల్లి గ్రామంలో ఓటుహక్కు వినియోగంపై ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో రత్నాకర్‌రావు గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న దివ్యాంగులను బీఎల్‌వోలు గుర్తించి వారికి ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 23 నుంచి 28 వరకు నిర్వహించనున్నారు. గురువారం ఆలయ కమిటీ సభ్యులు బ్రహ్మోత్సవా లకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అర్చకులు నర్సింహమూర్తి, సందీప్ శర్మ, ఆల య కమిటీ సభ్యులు రాజన్న, రమేశ్, రాములు, లక్ష్మణ్, సుధాకర్, భీమన్న, కిశోర్‌నాయక్, సురేశ్, శ్యాం, సత్యం, రాజు, రాకేశ్ తదితరులు ఉన్నారు.

21 నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

ఖానాపూర్: పట్టణంలోని పంచముఖి హనుమాన్ చౌరస్తాలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఈనెల 21 నుంచి 23వరకు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. గురువారం పట్టణంలోని ఆలయంలో విశ్వబ్రాహ్మణసంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వార్షికోత్సవానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా పూజా కార్యక్రమాలతోపాటు గోవిందమాంబ–వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం ఉంటుందని పేర్కొన్నారు.

కాషాయ జెండా ఎగురవేయాలి

- బీజేపీ నిర్మల్ అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద: నిర్మల్‌లో కాషాయజెండా ఎగురవేయడం ఖాయమని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఏలేటి నివాసంలో వడ్యాల్ గ్రామ సర్పంచ్ లలిత(బీఆర్‌ఎస్), మాజీ సర్పంచ్ అమరగొండ జ్యోతి, న్యాయవాదులు లింగాగౌడ్, రమణగౌడ్, కనకాపూర్ మాజీ సర్పంచ్ పెద్ద సాయన్న బీజేపీలో చేరారు. వారికి మహేశ్వర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అడ్వాల రమేశ్, గోవర్ధన్, రాంరెడ్డి, ప్రభాకర్, చిన్నయ్య, లక్ష్మణ్, జీవన్‌రెడ్డి, భరత్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌రూరల్ మండలం రత్నాపూర్ కాండ్లి, అనంతపేట, నిర్మల్‌లోని రాంనగర్, శాంతినగర్, నర్సాపూర్ మండలం టెంబుర్ని, నర్సాపూర్ మండలం కుస్లీ, సోన్ మండలం గాంధీనగర్ చెందిన వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. జిల్లా కేంద్రంలోని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నివాసంలో పార్టీలో చేరగా.. ఆయన కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు.



బీజేపీలో చేరిన నాయకులతో మహేశ్వర్‌రెడ్డి

వీరుల ఆశయ సాధనకు ఉద్యమించాలి

ఖానాపూర్: అమరుల ఆశయ సాధన కోసం దోపిడీ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య అన్నారు. గురువారం మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని తుమ్మగూడెం, అడవిసారంగాపూర్ పంచాయతీలోని జిల్లేడుకుంట గ్రామాల్లో అమరుల సంస్మరణ వారోత్సవాల ముగింపు సభలకు హాజరై మాట్లాడారు. వ్యవస్థలో మార్పు కోసం అందరూ ఉద్యమించాల్సిన అవసరం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజన్న, అంకుశ్‌రావు, మధు, మారుతి, జైతు, సుంగు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: భూమి కోసం, భుక్తి కోసం ఈ దేశ ప్రజల విముక్తి కోసం తమ ప్రాణాలను అర్పించిన వీరుల ఆశయ సాధనకు ముందుండి పోరాడాలని సీపీఐ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కె.రాజన్న పేర్కొన్నారు. గురువారం మండలంలోని వడ్యాల్‌లో అమరవీరుల సంస్మరణ సభను ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న, లింగన్న, ఆశన్న, కిషన్, సాయన్న, ముత్తన్న, గంగామణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మణచాంద: వడ్యాల్‌లో మాట్లాడుతున్న రాజన్న

ఐకేరెడ్డి నామినేషన్‌కు మద్దతుగా పాదయాత్ర

లక్ష్మణచాంద: జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో గురువారం బీఆర్‌ఎస్ నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంద్రకరణ్‌రెడ్డి నామినేషన్ వేశారు. వారికి మద్దతుగా మండలంలోని చామన్‌పెల్లి గ్రామస్తులు 300 మంది సర్పంచ్ పడిగెల గంగాధర్ ఆధ్వర్యంలో పాదయాత్రగా నిర్మల్‌కు వెళ్లారు. తమ గ్రామం మీదుగా వెళ్తున్న చామన్‌పెల్లివాసులకు పొట్టపల్లిలో బీఆర్‌ఎస్ నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్‌చైర్మన్ రఘునందన్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు జహీరుద్దీన్, చామన్‌పెల్లి సర్పంచ్ గంగాధర్, ఉపసర్పంచ్ రమణ, నరేశ్, చిన్నారెడ్డి, సాయన్న తదితరులు పాల్గొన్నారు.



రామాలయం నుంచి వెళ్తున్న చామన్‌పెల్లివాసులు

కొనుగోలు కేంద్రాల్లోనే పంట విక్రయించాలి

కడెం: రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే పంట విక్రయించుకోవాలని ఏవో సంధ్యారాణి అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మీసాగర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏవో ప్రారంభించారు. రైతులు తమ పంటను దళారులకు విక్రయించి నష్టపోకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి మోబిన్, పీఏసీఎస్ సిబ్బంది రాజం, రఘు తదితరులు ఉన్నారు.

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) ఎక్స్ రోడ్డు వద్ద ఆలూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో, జామ్, యాకర్‌పెల్లి గ్రామాల్లో కౌట్ల(బి) పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం మండల వ్యవసాయాధికారి రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో పీఏసీఎస్ సీఈఓలు సలీం, మల్లేశ్, ఏఈఓలు, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కడెం: కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏవో సంధ్యారాణి



జామ్‌లో కేంద్రం ప్రారంభిస్తున్న ఏవో

'అభివృద్ధి కోసం జాన్సన్‌ను గెలిపించండి'

ఖానాపూర్: నియోజకవర్గ అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వేణుగోపాలచారి అన్నారు. గురువారం మండలంలోని తర్లపాడ్ గ్రామంలో బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కల్వకుంట్ల నారాయణరావు, పుప్పాల శంకర్, పూర్ణచందర్‌నాయక్, గోవింద్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన మైనార్టీ నాయకులు

ఖానాపూర్: మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ముఖ్య అనుచరుడు జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ చాంద్‌పాషాతోపాటు మైనార్టీ నాయకుడు అనీస్ అహ్మద్‌ఖాన్ బీఆర్‌ఎస్‌లో చేరారు. గురువారం పట్టణంలోని ఏపీపీఎస్సీ మాజీ సభ్యుడు పైడిపల్లి రవీందర్‌రావు నివాసంలో ఎమ్మెల్సీ దండె విఠల్ వారికి బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని.. ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ గెలుపునకు కృషి చేయాలని పేర్కొన్నారు.

ఆలయాల్లో పూజలు

ఖానాపూర్ పట్టణంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నామినేషన్ వేసేందుకు పార్టీ శ్రేణులతో కలిసి ఉట్నూర్‌కు వెళ్లారు. తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.



పూజలు చేస్తున్న జాన్సన్‌నాయక్ దంపతులు



బోనాలతో ఆలయానికి వస్తున్న మహిళలు

పోచమ్మ సదర్‌బోనాల పండుగ

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామశివారులో ఉన్న నల్ల పోచమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం సదర్ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించేందుకు ఊరేగింపుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసం ఆకట్టుకుంది. పండితులు నర్సింహమూర్తి, కోటపల్లి అనిశ్, భీంజీనాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు తోకల బుచ్చన్నయాదవ్ తదితరులున్నారు.



పోతరాజుల విన్యాసాలు

అటెన్షన్ ప్లీజ్.. కోతకు గురైన రోడ్డు



తానూరు: మండల కేంద్రంలోని శివారు ప్రాంతంలో డబుల్‌రోడ్డు భారీ వర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టి సమస్య పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: కొండయ్య, ఆర్‌అండ్‌బీ డీఈ, ఫోన్: 96663 31486

తపాలా పథకాలు సద్వినియోగం చేసుకోండి



చెక్కు అందిస్తున్న సిబ్బంది

సోన్: ప్రతి ఒక్కరూ తపాలాశాఖ అందించే పొదుపు పథకాలు, బీమాను తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని భైంసా సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(డీసీడీపీ)లో భాగంగా తపాలాశాఖ అందించే పొదుపు పథకాలు, పీఎల్ఐ గురించి వివరించారు. ఐజీజీబీ సీనియర్ మేనేజర్ కల్యాణ్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ పథకాలు వివరించారు. అనంతరం తపాలాశాఖలో రూ.399 తో జీఏపీ పాలసీ తీసుకున్న అలకుంట శ్రీనివాస్ మరణించగా.. ఆయన భార్య మౌనికకు రూ.పది లక్షల విలువైన చెక్కును అందించారు. రవీందర్, అంబాజీ, నరేశ్, సాజిద్‌సింగ్, రమణ, మహేశ్, ప్రసాద్, సాయన్న, పవన్ తదితరులున్నారు.